శివయ్య ఆలయంపై 'పురావస్తు' నిర్లక్ష్యం

- నెర్రలుబారిన ఆలయ ప్రాకారం
- కూలిన బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణ మండపం పైకప్పు
- పురావస్తుశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆలయ ధర్మకర్తల మండలి
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు
- ఆగిన మహా కుంభాభిషేకం
- అరిష్టమంటున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: భక్తితో ఓం నమః శివాయా అంటూ చెంబుడు నీటితో అభిషేకిస్తే చాలు పులకించిపోయి వరాలిచ్చే భోళాశంకరుడిగా పేరుపొందిన శివయ్యకే పెద్దకష్టమొచ్చింది. అందరి కోర్కెలు తీర్చే బుగ్గరామలింగేశ్వరస్వామి మొర ఆలకించేవారే కరువయ్యారు. వివరాలు.. ... వందల ఏళ్ల చరిత్ర కలిగిన రెండో దక్షిణ కాశీగా పేరుగడించిన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని తూర్పు భాగాన కల్యాణమండం నైరుతీ భాగంలోని పైకప్పు నాలుగేళ్ల క్రితం కుప్పకూలిపోయింది. జీర్ణోద్ధరణ చేయాల్సిన పురావస్తు శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అదిగో ఇదిగో అంటూ సాకులు చెబుతున్నారు. నిర్మించేందుకు దాతలు ముందుకు వస్తున్నా పురావస్తు శాఖాధికారులు మాత్రం అనుమతులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు.

1960లో ఆలయ ప్రాకారం నిర్మాణం

1450–1460 మధ్య కాలంలో విరూపాక్షరాయలు కాలంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం నిర్మాణం జరిగింది. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాకారం 1960లో సుంకు శింగన్న జ్ఞాపకార్థం ఆయన కుమారులు సుంకు లక్ష్మయ్య సోదరుల సహకారంతో నిర్మించారు. ప్రాకారం నిర్మించి దాదాపు 63 ఏళ్లు కావడంతో నెర్రెలుబారుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రాకారం కుప్పకూలడం ఖాయమని భక్తులు చెబుతున్నారు.


కూలిన కల్యాణమండపం పై కప్పు


నెర్రెలుబారిన ఆలయ ప్రాకారం

ఆగిన మహా కుంభాభిషేకం:

చారిత్రాత్మక ఆలయాల్లో 24 ఏళ్లకోసారి మహా కుంభాభిషేకం నిర్వహించాల్సి ఉంది. 1979లో జనవరి 9న రెండోసారి మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఐదేళ్ల క్రితమే జరగాల్సిన కుంభాభిషేకం ప్రాకారపు గోడలు కూలిపోవడంతో ఆగిపోయింది. ఇప్పుడు కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకుగా సర్వం సిద్ధం చేశారు. అయితే ఆలయ ప్రాకారం నిర్మాణం పూర్తికాకపోవడంతో నిర్వాహకులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. కుంభాభిషేకం నిర్వహించకుంటే అరిష్టమని పండితులు చెబుతున్నారు. ఆలయాలకు ఉన్న శక్తి నశిస్తుందని, కొన్ని పూజలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అర్చకులు పేర్కొంటున్నారు.

దెబ్బతింటున్న వాహనాలు:

శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో బుగ్గరామలింగేశ్వరస్వామికి వాహన సేవలు నిర్వహించడం ఆనవాయితీ. దాతలు ముందుకొచ్చి రూ.లక్షలు ఖర్చు పెట్టి వాహనాలను తయారు చేయించి విరాళంగా ఇచ్చారు. అయితే వాటిని ఆలయంలోని కల్యాణమండపంలో భద్రపరిచారు. ప్రాకారం, కల్యాణమండపం పైకప్పు కూలడంతో చిన్నపాటి వర్షం కురిసినా భద్రపరచిన వాహనాలు దెబ్బతింటున్నాయి. దీంతో వాహనాలను విరాళంగా అందజేసిన దాతలు ఆందోళన చెందుతున్నారు.

భారత పురావస్తుశాఖ నిర్లక్ష్యం:

ఆలయంలో కుప్ప కూలిన ప్రాకారం, పైకప్పు నిర్మాణాలను తిరిగి చేపట్టేందుకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ తలారి రంగయ్యతో పాటు ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులు పలుమార్లు భారత పురావస్తు శాఖ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. అదిగో ఇదిగో అంటూ పురావస్తుశాఖ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. చారిత్రాత్మక శిల్పకళా సంపదను కాపాడాల్సిన భారత పురావస్తు శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాతల సహకారంతో నిర్మించుకుంటామని కేవలం అనుమతులు ఇస్తే చాలని కొందరు పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు.

పురావస్తు అధికారుల దృష్టికి తీసుకెళ్తా



తాడిపత్రి ఆలయాల కార్యనిర్వాహణాధికారిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణమండపం పైకప్పు కూలిన విషయం తెలుసుకున్నా. పురావస్తుశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం.

– సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహణాధికారి, తాడిపత్రి ఆలయాలు

క్లుప్తంగా

వైభవంగా నల్లమ్మ జాతర


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

శింగనమల: స్థానిక ఎస్సీకాలనీలో నల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. శింగనమలకు చెందిన నల్లప్ప కుటుంబం బెంగళూరులో స్థిర పడింది. వీరి కుటుంబం గ్రామంలో నల్లమ్మ ఆలయాన్ని నిర్మించింది. ఆదివారం బెంగళూరు నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా శనివారం రాత్రి నల్లమ్మ దేవి చరిత్రను కళాకారులు వివరించారు. కార్యక్రమం విజయవంతం అయిందని నిర్వాహకుడు రామాంజనేయులు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో పదేళ్ల సమస్యకు పరిష్కారం


తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పెద్దపప్పూరు: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు..నరసాపురం గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీలతో చేనేత మగ్గాల్లో నీరు ఊరుతుండేది. పదేళ్లుగా సమస్యలను అధికారులు తెలియజేసినా పరిష్కారం కాలేదు. ఇటీవల ప్రజాసంక్షేమ పాదయాత్రలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సమస్యను వివరించారు. తక్షణమే తాగునీటి పైపులైన్ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం నాటికి దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. పైపులైన్ సమస్య పరిష్కారానికి నోచుకోవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బుక్కరాయసముద్రం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ నాగార్జునరెడ్డి రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులు ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. అనవసరంగా ఎవరైనా రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయండి


వాసాపురం ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న బోరుబావి

యల్లనూరు: రహదారి పక్కనే లోతైన పెద్ద పెద్ద బోరుబావులు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు..యల్లనూరు నుంచి వాసాపురం, బుక్కాపురం మీదుగా తిమ్మంపల్లికి ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. వాసాపురం గ్రామంలోనే ఊరుబయట ఒకటి, బుక్కాపురం వెళ్లే దారిలో రెండు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. డ్రైవర్లు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు. ఆర్‌అండ్‌బీ అధికారులు బావుల చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వీధి రైల్వేట్రాక్ కంపచెట్ల వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు 'స్పందన'

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయవచ్చన్నారు. మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని సూచించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: కోటంకలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

10న రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్: టిప్పుసుల్తాన్ 274వ జయంతి సందర్భంగా ఈ నెల 10న పాతబస్టాండ్ వద్ద ఫాతెహా ఖానీ, అన్నదానం, రక్తదానం తదితర సేవాకార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈమేరకు టిప్పుసుల్తాన్ ఇత్త హాదుల్ ముస్లిమీన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, జిల్లా ఇన్‌ఛార్జ్ ఎంబీ.మౌలా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్దవడుగూరు : రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవీంద్ర, తహసీల్దార్ నాగభూషణ, ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతులతో మద్దతు ధరతో ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్న, కొర్రలు, రాగి, తదతర పంటలను రైతులు ప్రభుత్వ మద్దతు ధరలకు కొనుగోలు చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. గుత్తి, తాడిపత్రిలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. చిరు ధాన్యాలను కొనుగోలు చేయడం కోసం రైతులు తమ వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యాన్ని తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. కొర్రలు క్వింటా రూ.2125, జొన్నలు రూ.3,225, పత్తి రూ.7,020, మొక్కజొన్న రూ.2,090, జొన్నలు హైబ్రీడ్ రూ.3,180, సజ్జలు రూ.2,500, రాగులు రూ.3,846, కందులు రూ.7 వేలతో కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ డీఎం రవీంద్ర

ఉత్సాహంగా ఆర్డీటీ జూడో పోటీలు

యాడికి: కోనుప్పలపాడు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్డీటీ గుత్తి జోనల్ స్థాయి 2023–24 జూడో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. తాడిపత్రి, యాడికి, గుత్తి, పెద్దపప్పూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జూడో పోటీలను హెచ్‌ఎం చిన్న పెద్దన్న, ఆర్డీటీ జూడో కోచ్‌లు రమేష్, రెడ్డప్ప రెడ్డి ప్రారంభించారు. బాలుర విభాగం 25 కేజీల్లో బాబాయ్య, కెవిన్ కుమార్, పవన్ కుమార్, మనోజ్, నాగేష్, నరసింహ, స్నేహ వర్ధన్, 66 కేజీల్లో భరద్వాజ్, జగదీష్ విజేతలుగా నిలిచారు. బాలికల విభాగం 23 కేజీల్లో వైశాలి, 28 కేజీల్లో లాస్యవర్షిణి, 32 కేజీల్లో త్రివేణి, 36 కేజీల్లో రమ్యసుల్తానా, 40 కేజీల్లో దీక్షితా రెడ్డి, 44 కేజీల్లో సుచిత్ర, 48 కేజీల్లో లిఖిత, 52 కేజీల్లో రాజశ్రీ, 57 కేజీల్లో షబీనా, నాగమైత్రి గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విజేతలు ఈనెల 10న జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కోచ్‌లు రమేష్, రెడ్డప్పరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కోనుప్పలపాడు పాఠశాల హెచ్‌ఎం చిన్న పెద్దన్న, పీడీలు సరోజ, కాంచన, రవికుమార్, కోనుప్పలపాడు జూడో కోచ్ కంబగిరిస్వామి పాల్గొన్నారు.


జూడోలో తలపడుతున్న విద్యార్థులు

కరువు ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించాలి

గుంతకల్లు: కరువు పీడత ప్రాంతాల్లో కేంద్ర కరువు బృందం పర్యటించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 50 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేలు పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. వలసలకు అడ్డకట్ట వేయడానికి 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించి కూలీ కింద రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు ఎం.వీరభద్రస్వామి, ఎస్.గోపీనాథ్, నాయకులు రామురాయల్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

పెద్దపప్పూరు: మండలంలోని కొట్టాలపల్లిలో ఆదివారం గ్యార్మీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పురవీధుల్లో దస్తగిరిస్వామి జెండాలను ఘనంగా ఊరేగించారు. గ్రామానికి చెందిన దూదేకుల నాగేష్, పక్రుద్దీన్, బషీర్‌బాబా, హుసేన్‌పీరా, హాజీపీరా, బాబయ్య స్వామివారికి చెక్కెర చదివింపులు చేయించి భక్తులకు పంచిపెట్టారు.


జెండాలను ఊరేగిస్తున్న ముస్లింలు

పకడ్బందీగా ఓటరు నమోదు


గుత్తిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి


గార్లదిన్నెలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఎన్నికల అధికారిణి సుధారాణి


తాడిపత్రిలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కమిషనర్ రవి

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల అధికారిణి సుధారాణి పేర్కొన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని 44, 45, 46, 47 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నటు దరఖాస్తులనువెంటనే పరిష్కరించాలని బీఎల్ఓలకు సూచించారు. ఎన్నికల ప్రక్రియలో గ్రామ వలంటీర్లను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి తెలిపారు. ఆదివారం కమిషనర్ సిబ్బందితో కలిసి పట్టణంలోని 26 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదును పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఓటును పరిశీలించుకోవాలని సూచించారు. జాబితా పరిశీలన తదుపరి ఏమైనా తప్పులుంటే నిర్ణీత ఫారాల్లో సవరణలు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించాలని బీఎల్ఓలను ఆదేశించారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు ఎలా ఓటర్ల నుంచి క్లైయిమ్‌లు స్వీకరిస్తున్నారో ఆరా తీశారు. తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: బీఎల్ఓలు ఓటరు జాబితా నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ ఆర్వీ సునితబాయి సూచించారు. ఆదివారం ఆమె సొరకాయలపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియను సమీక్షించారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో అశ్వత్థనారాయణ స్వామి

పెద్దపప్పూరు: ఆశ్వయుజ మాసం మూడో ఆదివారం సందర్భంగా అశ్వత్థనారాయణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు సుధీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్య శర్మ, సునీల్ కుమార్ శర్మ స్వామిని వెండికవచంతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటుచేశారు.

8న మండల సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: ఈ నెల 8న ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

యల్లనూరులో మోస్తరు వర్షం

యల్లనూరు: మండలకేంద్రంతోపాటు జంగంపల్లి, పాతపల్లిలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఎండుతున్న పంటలకు ఉపశమనం లభించింది.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం

గుంతకల్లు: ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దామని డీఎస్పీ యూ.నరసింగప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని గుత్తిరోడ్డు ఎస్వీఆర్ సరోజని నాయుడు బాలికల ఉన్నత పాఠశాలలో ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీతోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, ట్రస్ట్ చైర్మెన్ శెట్టిపి జయచంద్రరెడ్డి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్వీవీ రమణయ్య హాజరయ్యారు. అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలటీ హార్ట్ కేర్ ఆస్పత్రి వైద్యులు అమర్, హర్షత్ 157 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కోశధికారి రాఘవేంద్ర, నాయకులు బి.శ్రీనివాసులు, శంకరయ్య, మల్లికార్జున, రాజ్‌కుమార్, జానికి, సిద్దయ్య, ప్రజా సంఘాల నేతలు నాగార్జున, ప్రసాద్ పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప, నాయకులు

అందుబాటులో పోటీ పరీక్షల మెటీరియల్


పామిడి గ్రంథాలయంలో ఉన్న మెటీరియల్

పామిడి: స్థానిక గ్రంథాలయంలో పోటీల పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆదివారం తెలిపారు. జిల్లా గ్రంథాలయం నుంచి గ్రూపు–2,3 తో పాటు డీఎస్సీకి సంబంధించిన మెటీరియల్ సరఫరా చేశారన్నారు. నిరుద్యోగ యువత మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా వరల్డ్ సండే స్కూల్ ఆరాధన


గీతాలాపన చేస్తున్న చిన్నారులు

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం వరల్డ్ సండే స్కూల్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీవీ మోహన్ వరల్డ్ సండే స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. బైబిల్ వాక్య పఠనం, బైబిల్ కంఠత వాక్యాలు, సంకీర్తనాలాపనలు వంటివి సండేస్కూల్ పిల్లలతో ప్రదర్శింపజేయడం గమనార్హం. చర్చి కార్యదర్శి పరదేశి విజయశేఖర్ రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, పీసీ రత్నరాజు, ప్రసాద్, రజని, మహిమ, ప్రిస్కిల్లా, సునీలమ్మ, వాత్సల్య పాల్గొన్నారు.

నేరప్రవృత్తి మానుకోకపోతే కఠిన చర్యలు


యల్లనూరు మండలం కల్లూరులో అనుమానితుడిని విచారిస్తున్న పోలీసులు


పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడులో పర్యటిస్తున్న పోలీసులు

గుంతకల్లుటౌన్: నేర ప్రవృత్తిని మానుకోకపోతే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నరసింగప్ప హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున ఇరానీ కాలనీలో పోలీసులు అనుమానితుల ఇళ్లను సోదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలకు చెందిన పలువురు ఇరానీలు ఎక్కడైనా దొంగతనాలకు పాల్పడి దొంగ సొత్తుతో ఇక్కడ ఆశ్రయం పొందాలని చూసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తులు వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. ఇకనైనా చోరీలు చేయడం మానుకుని కష్టపడి ఏదో ఒక పనిచేసుకుంటూ జీవనాన్ని సాగించాలని సూచించారు. వన్‌టౌన్, రూరల్ సీఐలు రామసుబ్బయ్య, మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: సమస్యాత్మక గ్రామమైన దేవునిఉప్పలపాడులో ఆదివారం పోలీసులు నాకాబంది నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా యాడికి సీఐ శంకర్‌రెడ్డి గ్రామస్తులతో మాట్లాడుతూ చిన్నపాటి సమస్యలకు రాజకీయ రంగుపూసి ఆధిపత్యం చలాయించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. గ్రామంలో సమస్య వచ్చినపుడు పోలీసులకు సమాచారం అందిచాలని సూచించారు. పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు ఎస్ఐలు శరత్ చంద్ర, గురుప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలో అతి సమస్యాత్మకమైన కల్లూరులో ఆదివారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసుల నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున రౌడీషీటర్లు, రాజకీయనాయకుల ఇళ్లు, గడ్డివాములను తనిఖీ చేశారు. గ్రామస్తులతో సీఐ సమావేశమై గ్రామంలో ఎటువంటి గొడవలకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏఎస్ఐ సంపత్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, సిబ్బంది ఉన్నారు.